# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 21-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- భారత నౌకానిర్మాణ రంగం సరికొత్త దృక్పథంతో ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు.
- ప్రపంచ వ్యాప్తంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.
- భారత్ - ఐరోపా సమాఖ్య (EU) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఖరారు కానుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు.
- శ్రీలంకతో జరిగిన త్రైపాక్షిక 'ఎ' సిరీస్ క్రికెట్ పోటీలో భారత 'ఎ' జట్టు విజేతగా నిలిచింది.

= = = = = = = = = = = = = = = = = = =

భారత నౌకానిర్మాణ రంగం సరికొత్త దృక్పథంతో ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా శ్యామాప్రసాద్ ముఖర్జీ పోర్టులో ఈరోజు జరిగిన కార్యక్రమంలో.. పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో తయారైన మూడు సరికొత్త యుద్ధనౌకలను ప్రధానమంత్రి జాతికి అంకితం చేశారు. ఐఎన్ఎస్ దూనాగిరి (INS Dunagiri), ఐఎన్ఎస్ సంశోధక (INS Sanshodhak), ఐఎన్ఎస్ అగ్రయ్ (INS Agray) నౌకలను ఆయన నౌకాదళంలోకి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ప్రధానమంత్రి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో రక్షణ రంగంలో ఎన్నో కీలక విధానపరమైన సంస్కరణలను అమలు చేసిందని గుర్తుచేశారు. సముద్ర శక్తి బలంగా ఉన్న దేశం ఆర్థిక, వ్యూహాత్మక ప్రభావం అంతే బలంగా ఉంటుందని, అందుకనుగుణంగానే భారత్ సన్నద్ధమవుతోందని పేర్కొన్నారు. నౌకల నిర్మాణం, వాటి మరమ్మతులు (Ship Repair), మెయింటెనెన్స్-రిపేర్-ఆపరేషన్స్ (MRO) రంగాలను జాతీయ మిషన్‌గా కేంద్రం భావిస్తోందన్నారు. రాబోయే కాలంలో సముద్ర తీర రక్షణ రంగం లక్షలాది మంది యువతకు ఉపాధి కల్పించే ఒక 'జాబ్ ఇంజిన్'గా మారబోతోందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్...27 సెకన్లు)

కాగా.. భారత నౌకాదళానికి చెందిన 'వార్‌షిప్ డిజైన్ బ్యూరో' రూపొందించిన ఈ మూడు నౌకలను, కోల్‌కతాకు చెందిన 'గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్' (GRSE) నిర్మించింది. ఒకేసారి మూడు అత్యాధునిక నౌకలను రంగంలోకి దించడం భారత సముద్ర రక్షణ సామర్థ్య చరిత్రలోనే ఒక మైలురాయి అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టులో.. ఈ అత్యాధునిక నౌకలు దేశ రక్షణ తయారీ రంగానికి, 'ఆత్మనిర్భర్ భారత్' పట్ల దృఢ సంకల్పానికి నిదర్శనమన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ సమాజానికి మన దేశం అందించిన అత్యంత అమూల్యమైన కానుక యోగా అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభివర్ణించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఈరోజు నిర్వహించిన యోగా ప్రదర్శనలో ద్రౌపది ముర్ము పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను అధిగమించడానికి యోగా ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా అశాంతి, ఒత్తిళ్లు పెరుగుతున్న నేటి తరుణంలో మానవాళిని ప్రశాంతత, సమతుల్యత, పరస్పర సామరస్యం, సామూహిక సంక్షేమం వైపు నడిపించడంలో యోగా అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని రాష్ట్రపతి ఆశాభావం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష పునః పరీక్ష ఈరోజు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ముగిసింది. దేశంలోని 551 నగరాలతో పాటు విదేశాల్లోని మరో 14 నగరాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. ఈ ఏడాది 22.79 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5:15 గంటల వరకు ఇంగ్లీష్‌తో పాటు తెలుగు సహా 12 భారతీయ భాషల్లో ఈ పరీక్ష నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా పెరియపాళయంలో సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతి పరిశ్రమలో ఈరోజు భారీగా అమ్మోనియా వాయువు లీకైంది. ఈ ప్రమాదంలో ఊపిరాడక ఏడుగురు కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 70 మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని, బాధితుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అస్వస్థతకు గురైన కార్మికులను వెంటనే సమీప ఆసుపత్రులకు తరలించి అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ ప్రమాదంపై తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున 2 లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

యోగాను కేవలం ఒక రోజు లేదా ఒక సందర్భానికి పరిమితం చేయవద్దని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవనశైలిలో భాగం చేసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని 'రెడ్ రోడ్' వేదికగా దేశవ్యాప్త యోగా వేడుకలకు ప్రధానమంత్రి నేతృత్వం వహించారు. ఈ ఉదయం వేలాది మంది యోగా సాధకులతో కలిసి ఆయన యోగ ఆసనాలు వేశారు. కార్యక్రమంలో నరేంద్రమోదీ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం ద్వారా శారీరక దృఢత్వాన్ని సాధించేందుకు, సమతుల్య జీవనాన్ని సాగించేందుకు యోగా తోడ్పడుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది 100 రోజుల ఆన్‌లైన్ యోగా క్లాసుల ద్వారా 'యోగా 365' అనే నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిందని ఆయన పేర్కొంటూ...

(వాయిస్…25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - ఐరోపా సమాఖ్య (EU) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఖరారు కానుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ముంబైలో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఒప్పందం వచ్చే ఏడాది (2027) ఫిబ్రవరి లేదా మార్చి నాటికి పూర్తిగా అమల్లోకి వచ్చే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ ఒప్పందం ద్వారా ఐరోపాలోని దాదాపు అన్ని దేశాల మార్కెట్లలోకి భారతీయ వ్యాపారాలు అత్యంత సులభంగా, దాదాపు 'సున్నా సుంకం' స్థాయిలతో ప్రవేశించడానికి వీలవుతుందని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని, యోగా సంప్రదాయాన్ని మేళవిస్తూ కేంద్ర సాంస్కృతిక శాఖ, భారత పురావస్తు శాఖ (ASI) సంయుక్తంగా దేశవ్యాప్తంగా 100 చారిత్రక ప్రదేశాలలో ప్రత్యేక యోగా కార్యక్రమాలను నిర్వహించాయి. న్యూఢిల్లీలోని ఎర్రకోట, హరిద్వార్, కోణార్క్, హంపి, మహాబలిపురం, ముంబై, నలంద, అహ్మదాబాద్, సార్నాథ్, లేహ్, హైదరాబాద్, సిల్చార్‌లలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలు జరిగాయి. ఈ ఏడాది 'యోగా సంగమం' పోర్టల్‌లో 6 లక్షలకు పైగా సంస్థలు తమ పేర్లను నమోదు చేసుకున్నాయని ఆయుష్ మంత్రిత్వ శాఖ తెలిపింది. భారతీయ సాంస్కృతిక సంబంధాల మండలి (ICCR) సమన్వయంతో విదేశాల్లోని దాదాపు 210కి పైగా భారతీయ రాయబార కార్యాలయాలు (Missions) ప్రపంచవ్యాప్తంగా 2 వేల 500 ప్రాంతాలలో యోగా దినోత్సవాలను నిర్వహించాయి.

= = = = = = = = = = = = = = = = = = =

శ్రీలంకలోని దంబుల్లా వేదికగా జరిగిన ముక్కోణపు క్రికెట్ వన్డే సిరీస్‌లో ఇండియా ఎ విజేతగా నిలిచింది. శ్రీలంక ఎ తో ఈరోజు జరిగిన ఫైనల్ మ్యాచ్ లో భారత్ ఎ 66 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 377 పరుగులు చేసింది. భారత బ్యాటర్లలో వైభవ్ సూర్యవంశీ 29 బంతుల్లో 94 పరుగులు, తిలక్ వర్మ 67 పరుగులతో రాణించారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీలంక.. 47.1 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌటైంది.

= = = = = = = = = = = = = = = = = = =

'ఎఫ్ఐహెచ్ హాకీ మహిళల నేషన్స్ కప్' టోర్నమెంట్‌లో విజేతగా నిలిచి, చరిత్ర సృష్టించిన భారత మహిళల హాకీ జట్టును ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంచారు. టోర్నీలో అద్భుత విజయంతో కప్‌ను కైవసం చేసుకున్న మహిళల జట్టుకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ మేరకు ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం వేదికగా పెట్టిన పోస్టులో భారత జట్టును కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాలు రెండు రోజుల్లో తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశా, జార్ఖండ్, బిహార్, ఛత్తీస్‌గఢ్‌లోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నట్లు వాతావరణ విభాగం (IMD) తెలిపింది. అస్సాం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, ఉప-హిమాలయ పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో ఈనెల 25 వరకు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం వుండటంతో ఈ ప్రాంతాలకు 'రెడ్ అలర్ట్' జారీ చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =